
సైకిల్ ఎక్కి ఇంటింటికీ తిరగండి

- టీడీపీ-జనసేన జెండాలను పట్టుకోండి
- సైకోను సాగనంపాలని ప్రజలను కోరండి
- కూటమి శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- కియ వద్ద రా.. కదలిరా సభకు పోటెత్తిన జనం

పొత్తు గెలవాలి..!





పెనుకొండ సమీపంలోని కియ వద్ద సోమవారం నిర్వహించిన 'రా.. కదలిరా' సభలో ప్రసంగిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

నీ అబ్బ సొత్తా..?

"లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు 4500 ఎకరాలు కేటాయిస్తే.. ఒక్క కంపెనీ పెట్టలేదు. ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు. ఇది మోసం కాదా? నేను కియ పరిశ్రమ స్థాపనకు 600 ఎకరాలు ఇస్తే... 50 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల విలువ రూ.10వేల కోట్లు. వాటిని కొట్టేసేందుకు జగన్ రూ.500 కోట్లకు టెండర్లు పిలిచారు. ఆ భూములు నీ అబ్బ సొత్తా జగన్..?"

చక్రవడ్డీతో చెల్లిస్తాం..

"రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేశాయి. వైసీపీ గూండాల్లారా జాగ్రత్త..! ఫొటోగ్రాఫర్‌పై పడిన ప్రతి ఒక్క దెబ్బకు వడ్డీ, చక్రవడ్డీతో చెల్లిస్తాం.."



'తమ్ముళ్లూ.. మరో 40 రోజులు సైకిల్ ఎక్కండి. తెలుగుదేశం, జనసేన జెండాలు కట్టుకుని ఇంటింటికీ వెళ్లండి. సైకోను సాగనంపేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురండి' అని టీడీపీ-జనసేన కూటమి శ్రేణులకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పెనుకొండ సమీపంలోని కియ వద్ద సోమవారం నిర్వహించిన 'రా.. కదలిరా' సభకు పోటెత్తిన జనాన్నుద్దేశించి ఆయన ఉద్వేగంగా ప్ర సంగించారు. అభివృద్ధి, సంక్షేమం తన మార్క్ అయితే.. అరాచకం, రక్త చరిత్ర జగన్ మార్క్ అని విరుచుకుపడ్డారు. బంగారు రాష్ట్రాన్ని భ స్మాసురులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ-జనసేన జ ట్టు కట్టినరోజే గెలుపు డిక్లేర్ అయ్యిందని అన్నారు. 'సంక్షోభంలో ఉన్న రై తును ఆదుకునేందుకు.. మీ బిడ్డల ఉద్యోగాల కోసం.. మహిళల రక్షణ, యువత భవిష్యత్తు, బడుగు బలహీనవర్గాల ఆత్మగౌరవం, బాదుడు లేని సంక్షేమం, కోతలు లేని పథకాల కోసం రా.. కదలిరా.. అని ఎలుగెత్తి పిలిచారు. యుద్ధానికి తాము సిద్ధమని నినదిస్తూ.. చంద్రబాబుకు జనం మద్దతు తెలిపారు.

ఇది నా మార్క్

"18 నెలల్లో గొల్లపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి.. కియ పరిశ్రమను తెచ్చింది టీడీపీనే. కియ పరిశ్రమ ఏర్పాటైన తర్వాత ఈ కరువు ప్రాంతంలో మార్పు వచ్చింది. అంతకు ముందు ఇక్కడ ఎకరా రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు ఉండేది. ఇప్పుడు ఎకరా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు అయ్యింది. కియ పరిశ్రమ ద్వారా 50వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాం. వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చాం. ఇక్కడ తయారు చేసిన 12 లక్షల కార్లు దేశ, విదేశాల్లో తిరుగుతున్నాయి. అదీ టీడీపీ మార్క్..!"



వలంటీర్లను తొలగించం..

"వలంటీర్ ఉద్యోగాలను తొలగించను. మీరు వైసీపీ దొంగలకు పనిచేయవద్దు. నెలకు రూ.5 వేలతో వలంటర్ ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు పోతున్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఇచ్చే బాధ్యత నాది. రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న సైకో పోతే తప్ప యువతకు భవిష్యత్తు ఉండదు. నేను ఐటీ ఉద్యోగాలు ఇస్తే.. జగన్ మటన్ కొట్టు, ఫిష్ మార్కెట్, మద్యం షాపులో ఉద్యోగం ఇచ్చాడు. టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగభృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తాం. సంవత్సరానికి 4 లక్షల చొప్పున ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తాం."

మరిన్ని వివరాలు 5, మెయిన్‌లో..

ఆమె అంటే ఇంతేనా..?

- భార్యల పదవులు.. అనుభవిస్తున్న భర్తలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో హడావుడి
- భార్యలను ఇంటికే పరిమితం చేస్తున్న వైనం
- వేదికలెక్కి లెక్చర్లిస్తున్న పతులు
- భూ పంపిణీలో చెరో వైపున కాపు, మెట్టు
- వేదికలపై ప్రొటోకాల్ లేని నాయకులు



రెండుగా విడిపోయి పట్టాలు పంపిణీ చేస్తున్న కాపు, మెట్టు

రాయదుర్గం, మార్చి 4: రాయదుర్గం ప్రాంతంలో ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలు ఏవగింజుకునేలా జరుగుతున్నాయి. ఎటువంటి పదవులు లేని వారిని ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీవారైతే చాలు అది ఏకార్యక్రమమైనా వేదిక లెక్కి లెక్చర్లిచ్చేస్తున్నారు. ఇందుకు సోమవారం రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూముల పంపిణీ కార్యక్రమమే నిదర్శనం. పార్టీ పదవి తప్ప ఎలాంటి ప్రభుత్వ



భార్యల స్థానాల్లో భర్తలు.. కుడి వైపు అద్దాలు పెట్టుకున్న వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డి, అతని పక్కన ఎమ్మెల్యే వైపు చూస్తున్న వన్నూరుస్వామి

పదవీ లేని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డితో సమానంగా వేదిక లెక్కి భూమి పట్టాలను అందజేశారు. పైగా లబ్ధిదారుల పేర్లు లేవని అధికారులకు వేదికపైనే చీవాట్లు సైతం పెట్టారు. అలాగే బొమ్మనహాళ్ ఎంపీపీ పద్మ స్థానంలో ఆమె భర్త చంద్రశేఖర్‌రెడ్డి, డీ.హీరేహాళ్ ఎంపీపీ పవిత్ర స్థానంలో వన్నూరుస్వామి తమ భార్యల ప్రొటోకాల్‌ను వేదికపై అనుభవించడమే కాకుండా ఉపన్యాసాలు కూడా ఇచ్చారు. తహసీల్దార్ చిట్టిబాబు వీరికి భార్యల ప్రొటోకాల్ ప్రకారం మైకులు ఇచ్చి మాట్లాడించారు. వీరితో పాటు వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వైసీపీ జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి కూడా మైకు తీసుకుని ఉపన్యసించారు. దీన్ని గమనించిన స్థానికులు మాత్రం ప్రజాస్వామ్యం మరి..ప్ ఏం చేస్తాం అంటూ నిట్టూర్చారు. ఈకార్యక్రమంలో ఒక వైపు ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మరో వైపు మెట్టు గోవిందరెడ్డి రెండుగా విడిపోయి ఒకేసారి పట్టాలు పంపిణీ చేయడం కూడా ఆసక్తికరంగా మారింది. అధికారులు ఎవరినీ కాదనలేని పరిస్థితిలో కనిపించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఎవరికి వర్తిస్తుందనే విషయాన్ని కూడా అధికారులు తెలుసుకోకుండా విధులు నిర్వర్తిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఏఆర్‌ఓ కిషోర్‌ను సస్పెండ్ చేయాలి

కలెక్టర్‌కు బీఎస్పీ నాయకుల ఫిర్యాదు

అనంతపురం సెంట్రల్, మార్చి 4: ప్రజాసామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సిన ప్రభుత్వ అధికారులు వైసీపీ సేవలో తరిస్తున్నారని, ప్రజలకు తప్పుడు సంకేతాలను పంపుతున్నారని బీఎస్పీ నాయకులు మండిపడ్డారు. రాయదుర్గం మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ పి.కిషోర్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమికి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

వారు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వంతో సబంధంలేని వైసీపీ నాయకుడు మెట్టు గోవిందరెడ్డి ఏఆర్‌ఓ సన్మానించడం సరికాదని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్, మెట్టు గోవిందరెడ్డిని కలిసి పూలమాలతో సత్కరించడం ఏమిటని, ఆయన ఓటర్లకు ఎలాంటి సందేశం పంపారని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ రాకముందే ఇలాంటి దుస్సాహాలకు తెగిస్తున్న ప్రభుత్వ అధికారులు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఏకపక్షంగా వ్యవహరించకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. కిషోర్‌ను సస్పెండ్‌చేసి, పారదర్శకంగా పనిచేసేవారిని ఆ స్థానంలో నియమించాలని డిమాండ్ చేశారు. త్వరతగతిన చర్యలు

డ్రిప్ పరికరాలు ఇచ్చేదెన్నడు..?

- డీడీలు చెల్లించి ఎదురుచూస్తున్న రైతులు
- అరటి సాగుకు అదను దాటుతుందని ఆందోళన

రాప్తాడు, మార్చి 4: ప్రభుత్వం అందించే సబ్సిడీ డ్రిప్ పరికరాల కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసుకుని, డీడీ కట్టినా సకాలంలో ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పలువురు రైతులు దరఖాస్తు చేశారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీలో, అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో అర్హులైన రైతులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పొలాలను, బోర్లలో నీటిని పరిశీలించి, పరికరాలు ఏ మేరకు అవసరమో అంచనా వేశారు. అధికారుల సూచన మేరకు సబ్సిడీ పోనూ, మిగిలిన మొత్తానికి డీడీలు కట్టారు. ఈ ప్రక్రియ ముగిసి నాలుగైదు నెలలు కావస్తున్నా పరికరాలను సరఫరా చేయలేదని రైతులు వాపోతున్నారు. ఏపీఎంఐపీ పీడీ



గొందిరెడ్డిపల్లిలో అరటి సాగుకు సిద్ధంగా ఉన్న భూమి



గొందిరెడ్డిపల్లిలో సాగుకు సిద్ధంగా ఉన్న అరటి పిలకలు

లాగిన్‌లో తమ దరఖాస్తులు అప్రూవ్ అయ్యాయని, కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. కలెక్టర్ వాటిని అప్రూవ్ చేస్తు వారం లేదా పది రోజుల్లో రైతుల పొలాల వద్దకే పరికరాలు సరఫరా అవుతాయని అంటున్నారు. రాప్తాడు మండల వ్యాప్తంగా 200 మందికి పైగా రైతులు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అరటి సాగు కోసం..

రాప్తాడు మండలంలో పలువురు రైతులు అరటి సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పిలకలను తెప్పించుకున్నారు. వీరిలో డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులే ఎక్కువగా ఉన్నారు. అరటి సాగుకు ఇది అనువైన సమయం. దీంతో త్వరగా పరికరాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. బిందు సేద్యం అరటికి తప్పనిసరి. లేదంటే బోరు నీరు సరిపడదు. మార్కెట్‌లో డ్రిప్ పరికరాలను కొనాలంటే ఎక్కువ ఖర్చు అవుతుంది. అందుకే ప్రభుత్వం సబ్సిడీపై అందించే పరికరాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మరింత జాప్యం జరిగితే తాము నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీడీలు చెల్లించిన రైతులకు త్వరలోనే డ్రిప్ పరికరాలు అందజేస్తామని ఏపీఎంఐపీ మండల అధికారి శ్రీరాములు తెలిపారు.

డీడీ చెల్లించా..



రెండు ఎకరాలకు అవసరమైన డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నాను రెండు నెలల క్రితం రూ.33 వేలు డీడీ కట్టాను. ఇప్పటి వరకూ పరికరాలను ఇవ్వలేదు. పీడీ లాగిన్‌లో నా దరఖాస్తు అప్రూవ్ అయ్యింది. కలెక్టర్ లాగిన్‌లో అప్రూవ్ అయితే పరికరాలు వస్తాయి. అరటి సాగుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ డ్రిప్ పరికరాలు లేక సాగు ఆలస్యమవుతోంది. అధికారులు స్పందించి వెంటనే మంజూరు చేయాలి.

\- శీనయ్య, గొందిరెడ్డిపల్లి

అరటి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి..



నాకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. అందులో 1.70 ఎకరాల్లో డ్రిప్పు కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారులు వచ్చి పొలాన్ని పరిశీలించి డ్రిప్పు ఎంత కావాలో అంచనా వేశారు. రూ. రెండు నెలల క్రితం రూ. 27 వేలు డీడీ చెల్లించా. ప్రస్తుతం అరటి సాగు చేయాలని మొక్కలు కూడా కొనుగోలు చేశా. డ్రిప్పు రాకపోవడంతో అరటి ఎలా సాగు చేయాలో అర్థం కాలేదు. ప్రైవేటుగా డ్రిప్పు కొనాలంటే ఎక్కువ ఖర్చవుతుంది.

\- ఉజ్జన్న, గొందిరెడ్డిపల్లి

పనిచేసేవారిపై పెత్తనమా..?

- నిరసన తెలిపే హక్కుకూడా లేదా?
- ఎస్కేయూ అధికారులపై ఉద్యోగుల ఆగ్రహం
- వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఎండలోనే నిరసన

అనంతపురం సెంట్రల్, మార్చి 4: 'సమయంతో నిమిత్తం లేకుండా విధులు నిర్వహిస్తున్నాం. అధికారులు పిలిచినప్పుడల్లా వచ్చి పనిచేస్తున్నాం. అయినా కనికరం లేకుండా మాపట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు..' అని ఎస్కేయూ అధికారులపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపే హక్కు కూడా తమకు లేదా అని ప్రశ్నించారు. హాస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, కాంట్రాక్ట్, మినిమం స్కేల్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్తంగా సోమవారం ఎస్కేయూ ముఖద్వారం వద్ద నిరసన తెలిపాయి. వారికి ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ శంకర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం సెక్రెటరీ మంజునాథ్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్కులప్ప, ట్రెజరర్ కేశవ మాట్లాడారు. ఎస్కేయూ పాలక మండలి సమావేశంలో తమ సమస్యలను ఎజెండాలో చేర్చి పరిష్కరించాలని కోరినా పట్టించుకోలేదని మండిపడ్డారు. సమ్మె చేయడానికి వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్యకు నోటీసు ఇచ్చామని అన్నారు. హాస్టల్ ఉద్యోగులకు టైంస్కేల్ లేదా మినిమం స్కేల్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని, పరిహారం చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.20వేల జీతం చెల్లించాలని 2022, జనవరిలో జీఓ విడుదలచేశారని, ఇప్పటికీ రూ.16వేలు మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. 'మీ డిమాండ్‌లు న్యాయమైనవే అని రిజిస్ట్రార్ లక్ష్మయ్య అంటున్నారు. నిరసన తెలిపేందుకు టెంట్ వేసుకుంటామని అనుమతి కోరితే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టుచేస్తామని బెదిరిస్తున్నారు..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మండే ఎండలో..

నిరసన తెలిపేందుకు టెంట్ వేసుకుంటామని ఎస్కేయూ ఉద్యోగులు కోరినా.. వర్సిటీ అధికారులు, పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్సిటీ ప్రధానగేటు వద్దే ఎండలోనే ఉద్యోగులు నిరసన తెలిపారు. మండే ఎండకు చాలామంది డీహైడ్రేషన్‌కు గురయ్యారు. చివరకు ఇటుకలపల్లి సీఐ, వర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య, పాలక మండలి సభ్యులు వచ్చి వారికి నచ్చజెప్పారు. వీసీ హుస్సేన్‌రెడ్డి మంగళవారం వస్తారని, ఆయనతో చర్చించి కార్యాచరణను ప్రకటించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ప్రసాద్, మల్లి, కిషోర్ నాయక్, ఫణిక్రిష్ణ, నూర్, రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎండలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కూలీల ప్రాణం తీసిన ప్రమాదం

- అదుపుతప్పి బోల్తాపడ్డ నూర్పిడి యంత్రం
- ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్, మార్చి 4: వేరుశనగ నూర్పిడి యంత్రం తిరగబడటంతో ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం కనగానపల్లి మండలం నెమలివరం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన శివమాలధారుడు ముత్యాలప్ప(29), జగన్నాథ్(50), సూరి, రాజప్ప తదితరులు కూలి పనులను చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. నెమలివరంలోని పలువురు రైతుల వేరుశనగ పంట నూర్పిడి పనులకు సోమవారం వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం ముత్తవకుంట్లకు తిరిగి వస్తుండగా నెమలివరం సమీపంలో, హంద్రీనీవా కాలువ బ్రిడ్జి వద్ద నూర్పిడి యంత్రం అదుపుతప్పి బోల్తా పడింది. యంత్రం పక్కభాగంలో కూర్చున్న ముత్యాలప్ప, జగన్నాథ్, రాజప్ప, సూరి యంత్రం కింద పడ్డారు. వారి ఆర్తనాదాలు విని సమీపంలో ఉన్న రైతులు పరుగున అక్కడికి చేరుకున్నారు. నూర్పిడి యంత్రాన్ని పైకి ఎత్తి, కింద ఉన్న నలుగురిని బయటకు తీశారు. అప్పటికే ముత్యాలప్ప, జగన్నాథ్ మృతిచెందారు. రాజప్ప, సూరి తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన అనంతపురం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతులు కుటుంబసభ్యులు, గ్రామస్థులు పెద్దఎత్తున ప్రమాద స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ముత్యాలప్ప మృతదేహాన్ని చూసి ఆయన భార్య శివమ్మ ఇక బతికేది ఎలా అంటూ గుండెలవిసేలా విలపించారు. జగన్నాథ్ భార్య పద్మావతి గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచివేసింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు కూలీలు మృతిచెందడంతో ముత్తవకుంట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కనగానపల్లి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



జగన్నాథ్ (ఫైల్)




ముత్యాలప్ప (ఫైల్)



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రక్తం పారిన చోట... నీరు పారించా..!





పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు పాలకులు రక్తం పారిస్తే.. తాను నీరు పారించానని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం రా.. కదిలిరా.. సభ నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు కృష్ణాజలాలు తీసుకొచ్చి, వేలాది ఎకరాలకు నీరిచ్చి సస్యశ్యామలం చేశానన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేసి, నీరిచ్చానన్నారు. ప్రపంచంలోని మేటి పరిశ్రమైన కియను జిల్లాలో తీసుకొచ్చానన్నారు. వేల మందికి ఉద్యోగాలిచ్చానన్నారు. కరువు సీమలో సిరులు కురిపించానన్నారు. కియకి 600 ఎకరాల భూమి ఇచ్చి 50 వేల మందికి ఉపాధి చూపించానన్నారు. లేపాక్షి హబ్ పేరుతో చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో సీఎం జగన్ తక్కువ ధరకే రైతుల నుంచి భూములను లాక్కున్నాడని మండిపడ్డారు. తాను కియకి 600 ఎకరాల భూమి ఇచ్చి 50 వేల మందికి ఉపాధి చూపించాననీ, రైతుల నుంచి 8848 ఎకరాల భూములు తీసుకొని కనీసం ఒక్క పరిశ్రమైనా, ఒక్క ఉద్యోగమైనా తీసుకొచ్చావా జగన్ అంటూ ప్రశ్నించారు. లేపాక్షి హబ్ భూములు వివాదాల్లో కూరుకుపోయాయనీ, వేల కోట్లు విలువ చేసే వాటిని 500 కోట్లకు వేలం పెట్టిన ఘనత జగన్‌దని దుయ్యబట్టారు.

- కాలువ గట్లపై నిద్రించి.. జిల్లాకు నీరిచ్చా
- కియను తీసుకొచ్చా.. దేశానికే ల్యాండ్ మార్క్‌గా మార్చా
- పెనుకొండకు కాదు.. కియ నగర్‌కు వచ్చినట్లుంది..
- అనంత అంటే అత్యంత ఇష్టం
- కరువు సీమలో సిరులు కురిపిస్తా
- రా.. కదలిరా.. సభలో చంద్రబాబు
- సీఎం జగన్‌పై నిప్పులు



సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే దేశానికే పవర్

అనంతపురం జిల్లాలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే దేశానికే పవర్ సరఫరా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. తద్వారా రైతులు లబ్ధిపొందవచ్చొన్నారు. దేశంలోనే అనంత జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ పంటలు కూడా తినడానికి రుచిగా ఉంటాయన్నారు. అపారమైన వనరులు ఉన్నాయనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను ఐదేళ్ల అధికారంలో ఉండి కియ తెచ్చాననీ, పదేళ్లు ఉండుంటే జిల్లా అంతటా పరిశ్రమలు ఏర్పాటు చేయించేవాడనన్నారు. తద్వారా నిరుద్యోగ సమస్య పూర్తిగా సమసిపోయేదన్నారు.

కియ నగర్‌కు వచ్చినట్లుంది..

తాను పెనుకొండకు వచ్చినట్లు లేదనీ, కియ నగర్‌కు వచ్చినట్లుందని చంద్రబాబు పేర్కొన్నారు. హంద్రీనీవా ద్వారా నీటిని తేవడానికి రూ.4500 కోట్లు తమ హయాంలో ఖర్చు చేశానన్నారు. ఆ నీరు రావడంతోనే కియ పరిశ్రమ ఏర్పాటైందన్నారు. తద్వారా జిల్లా, రాష్ట్రమేకాక దేశానికే ల్యాండ్ మార్క్‌గా అయిందన్నారు. 20ఏళ్ల క్రితం కదిరి నియోజకవర్గంలో సైన్స్ సిటీ కోసం భూములు కొనుగోలు చేశారనీ, అది ఏమైందని పాలక పక్షాన్ని ప్రశ్నించారు. తాను సంపద సృష్టిస్తే జగన్ పేదలను దోచుకున్నాడన్నారు. జగన్ సీమ ద్రోహి అంటూ ధ్వజమెత్తారు. కాలువగట్లపై పడుకుని జిల్లాకు సాగునీరు ఇచ్చానన్నారు. ఎడారిగా పేరుగాంచిన జిల్లాలో సిరులు కురిపించానన్నారు. అధికారంలోకి రాగానే గోరంట్ల మండలానికి సాగునీరు ఇస్తాననీ, మడకశిరలో పక్క మార్కెట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బాదుడులేని, కోతలులేని సంక్షేమం, మహిళల రక్షణ కోసం రా.. కదలిరా.. అని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. తనకు అనంతపురం అత్యంత ఇష్టమైన జిల్లా అన్నారు. ఇక్కడ 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను గెలిపిస్తే జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.

ఇదిగో.. వైసీపీ ఎమ్మెల్యేల చిట్టా..

హిందూపురం, మార్చి 4: పెనుకొండ నియోజకవర్గంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహించిన రా.. కదిలిరా.. సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రసంగంలో జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి చిట్టా విప్పారు. ఇలాంటి అవనీతిపరులను ఇంటికి సాగనంపుదామని టీడీపీ, జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు.

అక్కడ చెత్త.. ఇక్కడ బంగారమవుతుందా?

కళ్యాణదుర్గాన్ని సర్వస్వం దోచేసి మంత్రి ఉషశ్రీ పెనుకొండకు వచ్చారని చంద్రబాబు విమర్శించారు. ఆమె కళ్యాణదుర్గంలో చెత్త అయితే.. పెనుకొండకు వస్తే బంగారం ఎలా అవుతుందని బాబు ప్రశ్నించారు. ఈ నియోజకవర్గాన్ని కూడా ఆమె దోచేస్తారన్నారు.

తమ్ముళ్లకు నియోజకవర్గాన్ని దోచిపెట్టాడు..

పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ సీటు చిరిగిందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అనంతపురానికి బదిలీ చేశారన్నారు. ఆయన మొన్నటివరకు తమ్ముళ్లకు దోచి పెట్టాడన్నారు. ప్రతి పనికీ వారికి కప్పం కట్టాలనీ, పెన్నాను లూటీ చేసి ఇసుకను బెంగళూరుకి తరలించారని మండిపడ్డారు. వందల ఎకరాలను ఎమ్మెల్యే తమ్ముళ్లు ఆక్రమించారంటూ ధ్వజమెత్తారు.

దౌర్జన్యాలు, దోపిడీలకే తోపు

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి రెడ్డి దౌర్జన్యాలు, దోపిడీలకే తోపు అనీ, అభివృద్ధికి కాదని చంద్రబాబు ఎద్దేవా చేశారు. లేఔట్ వేయాలంటే ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిందేననీ, ఏ పని చేయాలన్నా కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనని ఆరోపించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ఓ భూమిపై కన్నేసి ఆ రైతు ఇవ్వనన్నందుకు మామిడి తోటను నరికించిన నరహంతకుడు తోపుదుర్తి అంటూ మండిపడ్డారు.

ధర్మవరాన్ని పీడిస్తున్న కేటుగాడు..

ధర్మవరం ప్రాంతాన్ని పీడిస్తున్న కేటుగాడు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అని చంద్రబాబు పేర్కొన్నారు. గుడ్ మార్నింగ్ అని తిరుగుతూ ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్తులన్నింటినీ దోచేశాడన్నారు. ఇక రాత్రిపూట ఈయన చేసే పనులు ఏమిటో అందరికీ తెలుసన్నారు. ఎర్రకుంటను మింగేసి ఫాంహౌస్ కట్టాడన్నారు. అక్కడ ఉదయం లేచిన వెంటనే గుర్రపు స్వారీ చేస్తాడన్నారు. ఇలాంటి కేతగాడు ప్రజలకు అవసరమా అని చంద్రబాబు ప్రశ్నించారు. సోలార్ ప్లాంట్‌కి ఇచ్చిన భూమిని బెదిరించి లాక్కున్న చరిత్ర కేతగాడిదన్నారు. ఉప్పలపాడు నుంచి ఇసుకను చెన్నై, బెంగళూరుకు తరలించి, వందల కోట్లు దోచేశాడన్నారు.

అతిపెద్ద అవినీతిపరుడు.. సిద్దారెడ్డి..

జిల్లాలోనే అతిపెద్ద అవినీతిపరుడు కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి అని ఆరోపించారు. ఈయన సీటును జగన్ చించేశాడన్నారు. ప్రతి పనుల్లో కమీషన్లు, వసూళ్లలో ఎమ్మెల్యే జోరు ప్రదర్శిస్తారన్నారు. కోనేరు ఆధునికీకరణ పేరుతో రూ.కోట్లు దండుకున్నాడన్నారు.

అవినీతి పుట్ట.. దుద్దకుంట..

జిల్లాలో అవినీతి పుట్టగా పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి నిలిచాడని చంద్రబాబు విమర్శించారు. ఆయన సీటు కూడా ఊడే పరిస్థితి ఉందన్నారు. సొంత కార్యకర్తలను కూడా వదలకుండా దోచేసిన ఘనుడన్నారు. ఆఖరికి లేఔట్ వేస్తే దానిని కూడా వదలలేదన్నారు. పుట్టపర్తిలో వందల కోట్లు దోచాడంటూ ధ్వజమెత్తారు.

మడకశిరకు పట్టిన రోగం డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర నియోజకవర్గానికి పట్టిన రోగం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అని చంద్రబాబు విమర్శించారు. ఆయనకు కూడా సీటు చిరిగిపోయిందన్నారు. ప్రతి పనికీ ముడుపులు తీసుకున్న ఎమ్మెల్యేగా పేరుగాంచారన్నారు. ఇసుకను బెంగళూరుకు తరలించి రూ.కోట్లు దండుకున్నాడన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేలు అవసరమా, వీళ్లందరినీ ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయనీ, కార్యకర్తలు, ప్రజలు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

కదంతొక్కిన తెలుగు తమ్ముళ్లు

కొత్తచెరువు, మార్చి 4: భగభగ మండే ఎండను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాలను స్వచ్ఛందంగా రా కదలిరా బహిరంగసభకు అశేష జనవాహిని తరలిరావడంతో సభాప్రాంగణం జనసంద్రంగా మారింది. చిన్నాపెద్దా అన్న తారతమ్యం లేకుండా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటుచేసిన పార్కింగ్‌లకు తరలించారు. బుక్కపట్నం మండలం జానకంపల్లి గ్రామానికి చెందిన 70 సంవత్సరాల వృద్ధుడు మోటుపల్లి నాగభూషణం ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్‌లతో దిగిన ఫొటోలను రిక్షాకు అలంకరించుకుని ఎండను సైతం లెక్కచేయకుండా 45 కిలోమీటర్లు తొక్కుకుంటూరావడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. అదేవిధంగా ముదిగుబ్బ మండలానికి చెందిన దివ్యాంగుడు ఉత్తప్పయాదవ్ చంద్రబాబును చూసేందుకు తరలివచ్చాడు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికలలో టీడీపీకి పట్టం కట్టాలన్న తపనతో ఈ సభకు పోటెత్తుతూ జనం రావడంతో పోలీసులు, వైసీపీ నాయకులకు కళ్లు బైర్లుకమ్మాయి.



సభకు తరలివస్తున్న దివ్యాంగుడు



బాలయ్య వాహనాన్ని చుట్టిముట్టిన అభిమానులు



45 కిలోమీటర్లు రిక్షాపై వచ్చిన వృద్ధుడు నాగభూషణం

మండుటెండను లెక్కచేయక.. పోటెత్తిన జనం


- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- వాహనాల్లోనే వేలాది మంది
- రా కదలిరా సభ సూపర్ హిట్
- కియను చూసి మురిసిన చంద్రబాబు
- బాబు ప్రసంగానికి విశేష స్పందన

పుట్టపర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పార్లమెంట్‌లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన 25వ ముగింపు సభ సూపర్ హిట్ అయింది. సోమవారం పెనుకొండ మండలం ఎర్రమంచి కియ కార్ల పరిశ్రమ ఎదురుగా నిర్వహించిన 'రా.. కదలిరా' బహిరంగ సభకు మండుటెండను లెక్కచేయని టీడీపీ శ్రేణులతో పాటు జనసేన నాయకులు, సత్యసాయి జిల్లా నుంచి ప్రజలు పోటెత్తారు. చంద్రబాబు ప్రత్యేక హెలీక్యాప్టర్ మధ్యాహ్నం 3 గంటలకు కియా కార్ల పరిశ్రమ, గొల్లపల్లి రిజర్వాయర్ మీదుగా చక్కర్లు కొట్టి కియ ఎదురుగా ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌లో ల్యాండ్ అయ్యారు. చంద్రబాబు రాకను చూసిన జనం హర్షధ్వానాలు, కేరింతలతో స్వాగతం పలికారు. సభావేదిక వద్దకు వచ్చిన చంద్రబాబు 1.05 నిమిషాలపాటు రాయలసీమ, ఉమ్మడి జిల్లా టీడీపీ హయాంలో తీసుకువచ్చిన సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలపై ప్రస్తావన చేయడంతో సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది. దేశానికే ల్యాండ్‌మార్క్ అయిన కియ కార్ల పరిశ్రమ ప్రస్తావన సభను పులకరింపచేసింది. టీడీపీ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, రిజర్వాయర్‌లతో పాటు అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా రూపురేఖలనే మార్చేసిన వైనం సభికులను ఆకట్టుకుంది. రా కదలిరా రాష్ట్ర వ్యాప్తంగా 24 సభలు నిర్వహించి ముగింపు సభ పెనుకొండలో సూపర్‌సక్సెస్ అయ్యింది. పెనుకొండతోపాటు ఉమ్మడి జిల్లాల నుంచి టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. సభాప్రాంగణమంతా జనసంద్రంలా మారి జాతీయ రహదారి 10 కిలోమీటర్ల మేర జనమేజనం కనిపించారు. ఓ వైపు మండుటెండ సలసల కాలుతున్నా జన ప్రవాహం మాత్రం ఆగలేదు. చంద్రబాబు ప్రసంగంలో టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, వైసీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి వ్యత్యాసాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ప్రధానంగా కియ పరిశ్రమ, జీడిపల్లి, భైరవాన్‌తిప్ప, మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, మడకశిర ఉపకాలువ, జీడిపల్లి, కుప్పం హంద్రీనీవా కాలువలలో నీటి గలగలలను ప్రస్తావించారు. టీడీపీ హయాంలో తెచ్చిన కియ పరిశ్రమ టీడీపీ మార్క్ అని ప్రస్తావించారు. లేపాక్షి హబ్ భూములలో నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కీలక సూత్రధారని, స్కీములు స్కాంలుగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. 8840 ఎకరాల లేపాక్షి హబ్‌భూములలో ఒక్క పరిశ్రమైన, ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అంటూ 600 ఎకరాల్లో కియ తెచ్చి 50వేల మందికి ఉద్యోగాలు ఇచ్చింది ఇది టీడీపీ మార్క్ అన్న ఉచ్ఛరణ సభికులను ఆనందింపచేసింది. సత్యసాయి జిల్లాల అధికార ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలు, దందాలపై చిట్టా విప్పి వీళ్లను ఈ ఎన్నికలలో తరలిమికొట్టాలని పిలుపునిచ్చారు. ముగింపు సభకు ఉమ్మడి జిల్లాల టీడీపీ నేతలు భారీగా హాజరయ్యారు. సభా అనంతరం ట్రాఫిక్ 5 గంటల సేపు స్తంభించింది. సభకు వచ్చిన జనం కియ వద్ద సెల్ఫీలు తీసుకోవడం ఇది టీడీపీ బ్రాండ్ అని అధికార పార్టీ నేతలకు సవాల్ విసిరారు. రా కదలిరా సభ సూపర్ సక్సెస్‌తో టీడీపీ, జనసేన నేతలతోపాటు పార్టీల శ్రేణులత్లో జోష్ వచ్చింది.



కియ పరిశ్రమ వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు






ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తూ...



సభావేదికపై ఉమ్మడి జిల్లా టీడీపీ, జనసేన నాయకులు



బాలయ్య.. చంద్రబాబు దరహాసం



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దగ్గుబాటి ప్రసాద్



సీడీని విడుదల చేస్తున్న చంద్రబాబు...

మోదీని గద్దె దించడమే 'ఇండియా' లక్ష్యం

- సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, మార్చి 4: ప్రధాన మంత్రి నరేంద్రమోదీని గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం అనంతపురం, సత్యసాయి జిల్లాల సీపీఐ నాయకుల సర్వసభ్య సమావేశం వీకే భవన్‌లో నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ మోదీ పదేళ్లుగా ప్రధానిగా ఉంటున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఆయన ఓట్లు అడిగే ముందు దేశ ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. 2047 నాటికి వికాస్ భారత్ పేరుతో అభివృద్ధి చేస్తానంటూ ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్నాడన్నారు. అయితే ఈ పదేళ్లలో ఆయన పేదవాడికి ఏమీ చేయలేదని, రైతులకు అన్యాయం చేశారని,వి దేశాల్లో ఉన్న బ్లాక్ మనీని వెనక్కి తీసుకురాలేక ఒక అసమర్థ ప్రధానమంత్రిగా ఉన్నాడన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు ఊడిగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని, దేశాన్ని కాపాడ్డానికే ఇండియా కూటమిని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో 7న గుంటూరు, 11న విశాఖలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, ఇతర నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

గంజాయి విక్రేత అరెస్ట్



గంజాయి విక్రేతను చూపుతున్న సీఐ

గుత్తి, మార్చి 4: గుత్తి పట్టణ శివారులోని పత్తికొండ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న సౌద నరేష్‌ను అరెస్ట్ చేసి, అతడి నుంచి 1.149కేజీల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్చార్జి సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను వెల్లడించారు. గుత్తి రోడ్డులోని పత్తికొండ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నరని సమాచారం మేరకు తాను, ఎస్ఐ నబీరసూల్ కలసి దాడులు నిర్వహించామన్నారు. గంజాయి విక్రయిస్తున్న గుత్తి మండలం టీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సౌద నరేష్, అలియాస్ ముంబాయినరేష్, అలియాస్ గాలిగాడును అదుపలోకి తీసుకుని అతని వద్ద నుంచి 420గ్రాముల కలిగిన 52గంజాయి ప్యాకెట్లను 720గ్రాములు లూజుగా ఉన్న గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఇతనిపై గతంలో నాటుసారాతో పాటు పలు దొంగతనాల కేసుల్లో ముద్దాయి అన్నారు. ఈ కేసుకు సంబంధించి మరికొంత మందిఉన్నారని వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

- 2020 ఫిబ్రవరిలో శింగనమలలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన జొన్నలగడ్డ
- ప్రారంభించిన కొద్ది రోజులకే ఆగిన వైనం
- అపరిశుభ్రతతో రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని పాలకులు


ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించిన శిలాఫలకం, మురుగునీటి కాలువ దుస్థితి

శింగనమల, మార్చి 4: శింగనమలలో భూగర్భ డ్రైనేజీ పనులను 2020 ఫిబ్రవరిలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.1.50 కోట్లతో ఈ పనులను ఎమ్మెల్యే బంధువైన ఓ కాంట్రాక్టర్ చేపట్టాడు. అయితే కొద్ది రోజులకే ఆ పనులను అతను ఆపేశాడు. ఇలా పనులు అర్ధాంతరంగా ఆపేయడంతో.. మురుగు కాలవల్లో నీరు సరిగా వెళ్లకుండా.. నిల్వ ఉంటోంది. దీంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలు కాలనీల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లు తోంది. దోమలు విపరీతంగా పెరిగి.. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ఎమ్మెల్యే ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆగిన ఆ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం లేదు. అరకొరగా పనులు చేసి కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అయోమయంలో పడ్డారు.

ప్రమాదాలు జరుగుతున్నాయ్ : లక్ష్మీదేవి

గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి దర్గా వరకు డ్రైనేజీ కాలువలు వేసి వదిలేశారు. కాలువ మీద కనీసం బడరాయి కూడా వేయలేదు. రోజు ఎవరో ఒకరు కిందికి పడి గాయపడుతున్నారు. దీనికి తోడు దుర్వాసన ఎక్కువగా వస్తోంది.

రోగాలు వస్తున్నాయ్ : సుబ్బరత్నమ్మ

మురుగు నీరు మొత్తం బస్టాండ్ వద్ద నిల్వ ఉండి.. అపరిశుభ్రంగా మారింది. పందులు సంచరిస్తుండటం, దోమలు ఎక్కువ కావడంతో చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. మా చిన్న పిల్లలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్రతను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

చర్యలు తీసుకుంటాం : శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు

శింగనమలలో భూగర్భ డ్రేనేజీ కాలువల పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. ఇది వరకు పనులు చేసిన కాంట్రాక్టర్ నష్టం వస్తుందని ఆ పనులు ఆపేశాడు. ఉన్న నిధులతో మిగిలిన పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన నీలకంఠుడు

అనంతపురం కల్చరల్, మార్చి 4: స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన సోమవారం నీలకంఠుడు విద్యాప్రదాయిని సరస్వతీదేవి అలంకరణలో హంసవాహనంపై ఊరేగారు. ఉదయం ఆలయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో దీక్షాహోమం నిర్వహించారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని సరస్వతీదేవిగా అలంకరించి మొదటిరోడ్డు, మూడో రోడ్డ మీదుగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.


హంస వాహనంపై సరస్వతీదేవి అలంకరణలో ఊరేగుతున్న స్వామివారు

చేనేత కార్మికుడు ఆత్మహత్య

అనంతపురం క్రైం, మార్చి 4: నగర శివారులో నివాసముంటున్న చేనేత కార్మికుడు లక్ష్మి నరసింహులు (40) ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిండికేట్ నగర్‌కు చెందిన లక్ష్మీ నరసింహులు భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మినరసింహులు ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండుగలకు ఫ్లెక్సీల ఏర్పాటులోనూ రాజకీయాలా..?

తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామయ్య

అనంతపురం అర్బన్, మార్చి 4: సంక్రాంతి, శివరాత్రి, ఉగాది పండుగలకు ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీల ఏర్పాటులోను రాజకీయాలు చేయడం ఏమిటని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామయ్య ఒక ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అధికార పక్షం నాయకులకు ఒక రకంగా, ప్రతిపక్షం నాయకులకు మరో రకంగా స్పందించడం సరికాదన్నారు. స్థానిక 28 డివిజన్ అశోక్ నగర్ సర్కిల్‌లో తాను శివరాత్రి పర్వదినానికి ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించాలని ఆదేశించడం భావ్యం కాదన్నారు. నాలుగు రోజుల క్రితమే తాను అనుమతులు కోరినా పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలకు లేని అభ్యంతరాలు... ప్రతిపక్ష పార్టీల నాయకుల ఫ్లెక్సీలకు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ కమిషనర్ జోక్యం చేసుకొని ఫ్లెక్సీల ఏర్పాటులో వివక్షను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించాలి


మాట్లాడుతున్న హరికృష్ణ

అనంతపురం విద్య, మార్చి 4: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఫోర్టో నాయకులు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధ్యాయభవన్‌లో ఫోర్టో రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ మాట్లాడుతూ... విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారడానికి కారణమైన జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక భద్రత కల్పించే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత హెచ్‌ఆర్‌ఏ స్లాబులు సైతం కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల సర్వీసు రూల్స్‌పై నాయకులతో చర్చించి సవరణలు చేయాలన్నారు. నాడు - నేడు పనులు చేసిన పీడీలకు సీఎల్స్ మంజూరు చేయాలన్నారు. ఇతర టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి వెంకటనారాయణరెడ్డి, ఇతర నాయకులు ఆదిశేషయ్య, శివయ్య,శ్రీనివాసులు, వెంకటేష్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు తరలివెళ్లిన నాయకులు


జయహో బీసీ సభకు వెళుతున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 4: మంగళగిరిలోని మంగళవారం జరిగే రాష్ట్ర స్థాయి జయహో బీసీ సభకు జిల్లాకు చెందిన నాయకులు సోమవారం సాయంత్రం అనంతపురం రైల్వే స్టేషన్ నుంచి రైలులో బయలుదేరి వెళ్లారు. ఇందులో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, బ్యాళ్ల నాగేంద్ర, ఓబులపతి, రామాంజినేయులు, ప్రదీప్, మాధవి, వన్నూరు, పెద్దన్న పాల్గొన్నారు.

బకాయి మెస్, కాస్మెటిక్స్ చార్జీలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మార్చి 4: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్స్ చార్జీలు చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ... ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఐదు నెలల నుంచి హాస్టళ్ల మెస్ ఛార్జీలను ఇంత వరకూ చెల్లించలేదన్నారు. ఇప్పటి వరకూ రూ. 7.20 కోట్లను ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిందన్నారు. దీంతో హాస్టళ్లలో పనిచేసే వార్డెన్లు అనేక అవస్థలు పడుతున్నాయన్నారు. ఇప్పుడు కేవలం ఒక్కో విద్యార్థికి రూ.1400 ఇస్తున్నారని, ఈ మొత్తాన్ని రూ. 1800లకు పెంచాలని, బకాయిలు విడుదల చేయాలని అన్నారు. తక్షణమే రూ. కోటి కాస్మెటిక్స్ చార్జీలను చెల్లించాలన్నారు. అదేవిధంగా హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను సైతం వెంటనే భర్తీ చేయాలని, లేని పక్షంలో విద్యార్థులతో కలసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందనలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, నేతలు హనుమంతు, నరసింహయాదవ్, వెంకట్ నాయక్, వంశీ, సాయి స్వరూప, మంజునాథ్, ఉమామహేష్, వినోద్, చందు,రాజేష్ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ వద్ద షో..!

అభ్యర్థులకు మళ్లీ నియామక ఉత్తర్వులు అందజేసిన పశుసంవర్థక శాఖ యంత్రాంగం

అనంతపురం అర్బన్, మార్చి 4: పశుసవర్థక శాఖ అధికారులు సాక్షాత్తు కలెక్టర్ వద్దనే షో చేశారు. గ్రామ పశుసంవర్థక సహాయకుల (విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు) నియామకం, స్థానాల కేటాయింపు ఉత్తర్వులు కలెక్టర్ చేతుల మీదుగా ఇప్పిస్తామని ఆ శాఖ అధికారులు ఇదివరకు ప్రకటించారు. అంతకు ముందే ఆదివారం పశుసంవర్థక శాఖ జేడీ ఆఫీస్‌లో 281 మంది సిబ్బందికి నియామకం, స్థానాల కేటాయింపు ఉత్తర్వులు హడావుడిగా రహస్య పద్ధతిలో అందజేయడం గమనార్హం. ముందస్తుగా సదరు ఉన్నతాధికారులు అనుకున్నట్లుగానే సోమవారం కలెక్టరేట్‌కు పలువురు సిబ్బందిని తీసుకువెళ్లి కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా మొదటి సారిగానే సిబ్బందికి నియామకపు, స్థానాల కేటాయింపు ఉత్తర్వులు ఇస్తున్నట్లుగా షో చేశారు. రాజకీయనేతల ఒత్తిళ్ల నేపథ్యంలో స్థానాల కేటాయింపుతోపాటు కొందరు అధికారుల అనాలోచిత నిర్ణయాలతోనే ఈ వ్యవహారం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంత ఉమ్మడి జిల్లాలో నియమితులైన 439 మందిలో ఇప్పటి దాకా 391 మందికి ఉత్తర్వులు అందజేసినట్లు సమాచారం. మిగిలిన వారికి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు అందజేస్తామని ఆ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.


నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

జగన్ మాటలు నమ్మి మోసపోవద్దు : జనసేన

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటలు నమ్మి మోసపోవద్దని... జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థికే ఓటేయాలని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత సూచించారు. సోమవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 31వ డివిజన్‌లో పర్యటించి స్థానిక ప్రజలతో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జగన్‌కు ఒక్కసారి ఛాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రం 30 సంవత్సరాలు అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందన్నారు. కావున రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జనసేన, టీడీపీలకు ఓటేసి గెలిపించాలని అన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా మార్చాడని మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పెండ్యాల చక్రపాణి, టీడీపీ జిల్లా డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి మారుతిగౌడ్, టీడీపీ డివిజన్ నాయకుడు దాడితోట సూరి, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.


మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

అన్ని పార్టీలూ మేనిఫెస్టో ప్రకటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మార్చి 4: రానున్న ఎన్నికల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోను ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో తెలుగుదేశం, వైసీపీ పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను ఈనెల 8వ తేదీలోపు కలిసి జిల్లా అభివృద్ధికి సీపీఎం చేస్తున్న ప్రత్యామ్నాయ విధానాలను వివరిస్తామన్నారు. అన్ని రంగాల్లోనూ జిల్లా వెనుకబడి ఉందని ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయని, ముఖ్యంగా వ్యవసాయం, నీటిపారుదలలో అత్యంత వెనుకబడి జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందులెదుర్కొంటదని అన్నారు. ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటి తోటలు ఎండిపోతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం గతేడాది ప్రకటించిన పంట నష్ట పరిహారం ఇంతవరకూ రైతుల ఖాతాల్లో జమ చేయలేదని, దీనివల్ల ప్రభుత్వం పట్ల రైతల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని విమర్శించారు. ఆత్మహత్యలు, వలసలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రైవేటీకరించడంతో మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి, పేదలపై అధిక ఆర్థిక భారం పడుతోందని, దీనివల్ల విపరీతంగా అప్పులు పెరిగిపోతున్నాయని అన్నారు. జిల్లా అభివృద్ధికి నిర్దిష్ట ప్రతిపాదనలు లేకుండా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా జిల్లాకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కాబట్టి జిల్లా అభివృద్ధి కోసం అన్ని పార్టీలు మేనిఫెస్టోను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

ధర్మవరంరూరల్, మార్చి 4: కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తలారి వెంకటేష్ (40) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. తన బొలేరా వాహనంలో తెల్లవారుజామునే టమోటాలు తీసుకుని అనంతపురం మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో స్థానికులు అతన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే తలారి వెంకటేష్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేష్‌కు భార్య మౌనిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తలారి వెంకటేష్ ప్రస్తుతం టీడీపీ రాప్తాడు నియోజకవర్గ బోయసాధికార సమితి కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. ఆయన మృతికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఆలం అభిమానుల మెగా రక్తదాన శిబిరం


ఆలంను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

నార్పల, మార్చి 4: స్థానిక ఆలం క్యాంపు కార్యాలయం వద్ద టీడీపీ జిల్లా నాయకులు, వకుళ వెంకట్ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, వికలాంగుల కాలనీ, యువకుల మధ్య సోమవారం కోలాహలంగా జరిగాయి. ఆలం అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 320 మంది రక్తదానం చేశారు. అభిమానులకు ఆలం భోజనం ఏర్పాట్లు చేశారు. అనంతరం పలువురు ఆలం అభిమానులు, ప్రత్యేకంగా వికలాంగుల కాలనీ వారు ఆయనతో కేక్ కట్ చేయించారు. ఈ వేడుకల్లో వైద్య సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షలకు 799 మంది గైర్హాజరు

అనంతపురం విద్య : ఇంటర్మీడియట్ పరీక్షలకు సోమవారం 799 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సోమవారం జనరల్ విద్యార్థులు 23,679 మందికిగాను 22,997 మంది హాజరు కాగా 682 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,440 మందికిగాను 2,323 మంది హాజరుకాగా 117 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈసీ కన్వీనర్, డీవీఈఓ వెంకటరమణ నాయక్ తెలిపారు.

పోతన్నకు ఘన నివాళి

శింగనమల : శింగనమల సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోతన్న వర్ధంతి సందర్భంగా చిన్న జలాలపురంలోని స్థూపం వద్ద సీపీఐ రైతు సంఘం నాయకులు సోమవారం నివాలర్పించారు. ఇందులో ఏపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షుడు మధుయాదవ్, సీపీఐ నాయకులు నేసే మధు, మునిస్వామి, దుబ్బన్న, రూప్లానాయక్, నరసింహారెడ్డి, కుటుంబ సభ్యులు చంద్రశేఖర్, రాము,నాగమునేమ్మ, చంద్రకళ, అనూరాధ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు

అనంతపురంసెంట్రల్ : పల్స్ పోలియో వ్యాక్సినేషన్‌లో కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలందించారు. సోమవారం లెనిన్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాక్సినేషన్‌కు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామక్రిష్ణ, ఫాతిమా ముస్సీసా ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. పిల్లలను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డితో కలిసి మొక్కలు నాటారు.

చీనీ కాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి రూ.14 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 109 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

హత్య కేసులో వ్యక్తికి రిమాండ్

అనంతపురం క్రైం : నగరంలోని పవర్ ఆఫీస్ వద్ద శనివారం రాత్రి జరిగిన హత్య కేసులో మహమ్మద్ రఫీ అనే వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. మద్యం మత్తులో బాలయ్య (72)ను హత్య చేసిన విషయం పాఠకులకు తెలిసిందే.

నేడు, రేపు యూత్ పార్లమెంట్ సభలు

అనంతపురం క్లాక్‌టవర్ : నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో యూత్ పార్లమెంట్ సభలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రాఘవేంద్ర ఫార్మసీ కాలేజీ, బుధవారం జేఎన్‌టీయూలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ సభ ఉంటుందన్నారు. 15-29 సంవత్సరాల వయస్సు కలిగిన యువత వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్, నారీశక్తి, ప్రధానమంత్రి శక్తి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, యువత అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తి, ప్రధానమంత్రి గతిశక్తి పథకాలపై చర్చించాలన్నారు. మరిన్ని వివరాలకు 98498 71174ను సంప్రదించాలన్నారు.

ఘనంగా మాఘమాస పూజలు

శింగనమల : మండలంలోని శివాలయాలు, పలు దేవాలయాల్లో నాల్గో మాఘ మాస సోమవారం సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. స్థానిక నీలాకంఠేశ్వర, చిన్నకాలువ శివాలయం, చిన్నజలాలపురం దొనరామేశ్వర దేవాలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

జూదరుల అరెస్టు

అనంతపురం క్రైం : అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని సిండికేట్ నగర్ సమీపంలో పేకాట స్థావరంపై సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి... వారి నుంచి రూ. 11,200 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వందశాతం ఓటింగ్ నమోదు కావాలి


కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 4 : రాబోయే ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ నమోదుకు కృషి చేయాలని అధికారులకు కలెక్టరు గౌతమి ఆదేశించారు. సోమవారం ఎన్నికల అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో అంతర్ రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో సాగాలన్నారు. ఈసారి జిల్లాలో 2213 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా ఈ సారి 23 సహాయక పోలింగ్ కేంద్రాలు, అలాగే నాలుగు పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. ఉరవకొండలో 4, తాడిపత్రిలో 2, అనంతపురం అర్బన్‌లో 15 రాప్తాడు నియోజకవర్గంలో 2 చొప్పున సహాయ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1450 నుంచి 1500 మధ్య ఓట్లు ఉంటే సహాయక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మాత్రమే నాలుగు పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలన్నారు. సమావేశాలలో జేసీ కేతన్‌గార్గ్ ఎస్పీ అన్బురాజన్, జడ్పీసీఈఓ, అధికారులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 4: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. డిసెంబరు నుంచి జనవరి వరకు బీటెక్ నాలుగో సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్ 20) రెగ్యులర్, (ఆర్ 15,19) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. అదేవిధంగా నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 15) సప్లిమెంటరీతో పాటు ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్ 15) లాస్ట్‌చాన్స్ పరీక్షలు నిర్వహించామన్నారు. వీటితో పాటు ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ పరీక్షల కూడా నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జగన్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 4: బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, పింఛన్ పెంపు, స్వయం ఉపాధి తదితర మోసపూరిత హామీలతో దివ్యాంగులను వంచించిన సీఎం జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఉపాధ్యాయ భవనలో 'హలో వికలాంగ్ చలో విజయవాడ' పోస్టర్‌ను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. పలుమార్లు ధర్నాలు, నిరసనలు, ఆందోళనలతో తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నా పెడచెవిన పెట్టిందని మండిపడ్డారు. జగన్ నియంతృత్వ విధానాలపై గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 9న మహాగర్జన తలపెట్టామని, పెద్దసంఖ్యలో దివ్యాంగులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, కదిరప్ప, నాగేష్, రామాంజినేయులు, నిషార్, కొండన్న పాల్గొన్నారు.

రా కదలిరా సక్సెస్

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమ వద్ద చంద్రబాబు నాయుడు సోమవారం నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభకు పలు మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలిరావడంతో సభ విజయవం తమైంది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ప్రత్యేక వాహనాల్లో ఉత్సాహంగా తరలివచ్చారు.


చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతున్న పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ


మరూరు టోల్‌గేట్ వద్ద రాప్తాడు మండల నాయకులు


కదలిరా సభకు తరలివెళ్తున్న కురుగుంట, ఆత్మకూరు నాయకులు



చంద్రబాబును కలిసిన అమిలినేని


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 4: పెనుకొండలో నిర్వహించిన రా..కదలిరా సభకు హాజరైన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కలిశారు. అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని చంద్రబాబునాయుడు సూచించినట్లు అమిలినేని తెలిపారు. గ్రామ గ్రామాన జోరుగా ప్రచారం చేపట్టి, విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని చెప్పారని తెలిపారు.

జేసీపీఆర్, ఆయన తనయుడు...


చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న జేసీపీఆర్, జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 4: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సోమవారం జరిగిన రా కదలిరా సభకు హాజరైన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి కలిశారు. ఆయనకు శాలువాకప్పి జ్ఞాపికను అందించారు. అనంతరం తాడిపత్రి రాజకీయాల గురించి జేసీపీఆర్‌తో చంద్రబాబు కొద్దిసేపు చర్చించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రాయదుర్గం రూరల్, మార్చి 4: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం వేదావతి హగరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సెబ్ పోలీసులు కేటీఎస్ డిగ్రీ కాలేజీ వద్ద ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ట్రాక్టర్‌కు రూ. 10 వేలు అపరాధ రుసుము విధించి వదిలేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

టీడీపీలోనే బడుగులకు పెద్దపీట: కాలవ


సెల్ఫీ దిగుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 4: సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలు తొలగించాలని తెలుగుదేశంపార్టీ తొలి నుంచి బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా పెద్దపీట వేసిందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజ్‌లో భాగంగా టీడీపీ హయాంలో భూమి కొనుగోలు పథకం ద్వారా లబ్ధి పొందిన దళిత మహిళలతో మురడి గ్రామంలో సోమవారం ఆయన 47వ సెల్ఫీ దిగారు. చంద్రబాబునాయుడు 2014-19 మధ్య కాలంలో నిరుపేద దళిత వ్యవసాయ కూలీలకు భూములను కేటాయించి ఆదుకున్నారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఎంతో మంది భూమి లేని దళిత మహిళలకు వ్యవసాయ భూములను కేటాయించి వారిని రైతులుగా మార్చిన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశమేనన్నారు. దళితుల అభ్యున్నతికి, పాటు పడుతున్న ఇలాంటి సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి ఎందుకు కొనసాగించడం లేదని కాలవ ప్రశ్నించారు. దళితులకు అడుగడుగునా ద్రోహం చేస్తున్న ప్రభుత్వం వైసీపీనేనని ఆయన విమర్శించారు. తమ పాలనలో రాయదుర్గం నియోజకవర్గంలో భూమిలేని 85 దళిత కుటుంబాలకు రూ. 6.64 కోట్ల ఖర్చుతో 241.50 ఎకరాల భూమిని కేటాయించామని గుర్తు చేశారు. ఐదేళ్ల ఎమ్మెల్యే, ఆరేళ్ల ఎమ్మెల్సీగా ఉన్న మెట్టు గోవిందరెడ్డి రాయదుర్గంలో ఇలాంటి కార్యక్రమం ఒక్కటైనా చేశారా అని నిలదీశారు. మెట్టు లాంటి అసమర్థులకు ఓటు వేస్తే దళితులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. దళితులకు మేలు జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.

సమష్టిగా పని చేసి విజయం సాధిద్దాం

● అమిలినేని యశ్వంత్


చెక్కును అందజేస్తున్న అమిలినేని యశ్వంత్

కళ్యాణదుర్గం, మార్చి 4: టీడీపీ-జనసేన నాయకులందరూ సమష్టిగా పని చేసి విజయం సాధిద్దామని అమిలినేని యశ్వంత్ పిలుపునిచ్చారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్‌ను జనసేన నియోజకవర్గ నాయకులు కలిశారు. భవిష్యత్ కార్యచరణ, ఉమ్మడి ప్రచారంపై చర్చించారు. ప్రజల్లోకి మేనిఫెస్టోను విస్తృతంగా తీసుకెళదామన్నారు. యువతకు ఉద్యోగ భద్రత చంద్రబాబునాయుడుతోనే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. యువత ముందుకు వచ్చి సీఎంగా చంద్రబాబునాయుడును గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పట్టణంలోని శివాలయాన్ని సందర్శించి శివమాలధారులతో అమిలినేని యశ్వంత్ చర్చించారు. ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల చెక్కు అందజేత

నిధులు లేక అర్ధంతరంగా ఆగిపోయిన ఎన్జీవో భవన నిర్మాణానికి తక్షణ సాయంగా రూ. 4 లక్షల చెక్కును అమిలినేని యశ్వంత్ ఉద్యోగ సంఘాల నేతలకు అందజేశారు. పట్టణంలో అర్ధంతరంగా ఆగిపోయిన ఎన్జీవో భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించి ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వమే ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. ఉద్యోగ సంఘాల నేతలంతా టీడీపీకి మద్దతివ్వాలని కోరారు.

టీడీపీలో చేరిన ముల్లంగి బ్రదర్స్


ముల్లంగి సోదరులకు కండువా వేస్తున్న చంద్రబాబు

బొమ్మనహాళ్, మార్చి 4: రాయదుర్గం వైసీపీ సమన్వయ కర్త మెట్టు గోవిందరెడ్డి సొంత మండలమైన బొమ్మనహాళ్‌లో ఎదురుదెబ్బ ఎదురైంది. ఆయనకు ముఖ్య అనుచరులైన ముల్లంగి సోదరులు టీడీపీలో చేరారు. మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామానికి చెందిన ముల్లంగి నారాయణస్వామి, ముల్లంగి భాస్కర్‌లు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెనుకొండలో జరిగిన రా కదిలి రా సభలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ముల్లంగి నారాయణస్వామి సతీమణి నాగమణి ఎంపీటీసీగా, ముల్లంగి భాస్కర్ సతీమణి భారతి ఉప్పరహాళ్ సర్పంచ్‌గా గెలుపొందారు. వీరికి ఎంపీపీ పదవి ఇస్తామని చెప్పి వైసీపీ మాట తప్పడంతో ఆ పార్టీకి దూరమయ్యారు. దీంతో వారు వైసీపీకి రాజీనామా చేసి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ముల్లంగి సోదరులు పార్టీ మారడంతో వైసీపీకి చెందిన మరికొంత మంది చేజారిపోకుండా తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారని తెలుస్తోంది.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోపాల్

గుంతకల్లుటౌన్, మార్చి 4: యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు నైతిక విలువలతో కూడిన ఓటింగ్ కీలకమన్నారు. 18సంవత్సరాల నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల స్వీప్ అంబాసిడర్ బసెట్టి క్రిష్ణయ్య, ఆధ్యాపకులు డాక్టంర్ నటరాజ్, డాక్టర్ కే వెంకటేశ్వర్లు, డాక్టర్ సురేష్, డాక్టర్ గోపి, నాగార్జున, డీ వెంకటేశ్వర్లు, సీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం


ధ్వజారోహణంలో పాల్గొన్న భక్తులు

తాడిపత్రిటౌన్, మార్చి4: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. రాత్రికి చిత్రగోపురం తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

8 నుంచి శివరాత్రి ఉత్సవాలు

ఉరవకొండ, మార్చి 4: వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణయ్య తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 8న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, 9న రథోత్సవం, 10న వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ, మార్చి 4: మండలంలోని చిన్న ముష్టూరు ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రశస్త తెలిపారు. ఈ నెల 31 తేదీలోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 21 తేదీ పరీక్ష ఉంటుందన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

పెద్దపప్పూరు, మార్చి4: మండలకేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో సోమవారం ఎంపీడీఓ కవిత ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. ఓటుతోనే రాష్ట్ర, దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజు, డిప్యూటి తహసీల్దార్ మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రిటౌన్, మార్చి4: మండలంలోని చిన్న పొలమడ గ్రామానికి చెందిన 20 వైసీపీ మద్దతు కుటుంబాలు సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారికి జేసీపీఆర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుమార్ స్వామిరెడ్డి, రామాంజి, గోపాల్, ప్రహ్లాద, కృష్ణ, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపప్పూరు, మార్చి4: మండలంలోని చిన్న పప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శాశ్వత హుండీ ద్వారా రూ.2,55,334, తాత్కాలిక హుండీ ద్వారా రూ.5,32,863 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

యల్లనూరు, మార్చి4: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపారు. ఉదయం 10గంటలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 107 మందికి పట్టాలు ఇస్తామన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా

పుట్లూరు, మార్చి4: మండలంలోని కుమ్మనమల గ్రామ సమీపంలో చాకలి ఆంజనేయులు అనే వ్యక్తి సోమవారం రాత్రి బైక్‌బోల్తా పడి గాయపడ్డాడు. తన అరటితోట నుంచి ఇంటికి వెళుతుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుత్తి టౌన్‌బ్యాంకుకు వందేళ్ల జ్ఞాపిక

గుత్తి, మార్చి 4: వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తమ బ్యాంకుకు రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శన విక్రమ్ జర్దోష్ మెమెంటోను అందజేశారని ది గుత్తి టౌన్ బ్యాంక్ చైర్మన్ అబ్దుల్ జిలాన్ తెలిపారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో దేశంలోని సహకార, పట్టణ బ్యాంక్‌లను ఆర్థిక, సాంకేతికంగా మెరుగుపరచడానికి కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో అంబరిల్లా ఆర్గనైజేషన్ సమక్షంలో సభను నిర్వహించారన్నారు. ఈ సభలో దేశంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న కొన్ని బ్యాంక్ చైర్మన్లను సత్కరించినట్లు వెల్లడించారు. అందులో గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ తరఫున అధ్యక్షుడిగా తాను జ్ఞాపిక అందుకున్నట్లు అబ్దుల్ జిలాన్ వివరించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్మన్ జ్యోతింద్ర మెహతా, ఎన్ఏఎఫ్‌సీయూబీ చైర్మన్ లక్ష్మీదాస్, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ రాఘవేంద్రరావు, దిగుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సీఈఓ మహేశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి నుంచి జ్ఞాపికను అందుకుంటున్న అబ్దుల్ జిలాన్

బాబు ష్యూరిటీతో ప్రతి కుటుంబానికి లబ్ధి

బెళుగుప్ప, మార్చి 4: టీడీపీ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్ సింహ పేర్కొన్నారు. మండలంలోని శీర్పి గ్రామంలో విక్రమ్ సింహ సోమవారం బాబు ష్యూరిటీపై నాయకులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.


పి.నారాయణపురం బాబుష్యూరిటీలో పాల్గొన విజయ్ సింహ

కూడేరు: వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను మరోమారు గెలిపించాలని ఆయన తనయుడు పయ్యావుల విజయసింహ ప్రజలను అభ్యర్థించారు. సోమవారం ఆయన పి. నారాయణపురం గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గూర్చి వివరించారు.

వైసీపీ నుంచి 34 కుటుంబాలు టీడీపీలో చేరిక


పార్టీలోకి చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, మార్చి 4: మండలంలోని జల్లిపల్లిలో వైసీపీకి చెందిన 34 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వారికి పార్టీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పారు. ఉరవకొండ నియోజక వర్గ అభివృద్ధి పయ్యావుల సోదరులతోనే సాధ్యమవుతుందని అందుకే టీడీపీలోకి చేరుతున్నట్లు పలువురు తెలిపారు.

యాడికిలో నాలుగు పరీక్షా కేంద్రాలు

యాడికి, మార్చి4: ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు సంబంధించి యాడికిలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ కాశప్ప తెలిపారు. యాడికి హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం-ఎ, పరీక్ష కేంద్రం-బీ, ప్యారడైజ్ హైస్కూల్, వాగ్దేవి హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. యాడికి హైస్కూల్-ఏ కేంద్రంలో 150మంది విద్యార్థులకు, పరీక్ష కేంద్రం బీలో 142మంది విద్యార్థులు, ప్యారడైజ్ హైస్కూల్‌లో 240మంది విద్యార్థులు, వాగ్దేవి హైస్కూల్‌లో 240మంది విద్యార్థులను కేటాయించినట్లు ఆయన తెలిపారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు, మార్చి4: మండలంలో ఉపాధిహామి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ షబ్బీర్‌బాషా తెలిపారు. కుటుంబంలో 5ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులు అర్హులన్నారు. ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సిమెంట్ పరిశ్రమలో భద్రతా వారోత్సవాలు

తాడిపత్రిటౌన్, మార్చి4: మండలంలోని తలారిచెరువు గ్రామ సమీపంలో ఉన్న పెన్నాసిమెంట్ పరిశ్రమలో సోమవారం 53వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. చీఫ్ జనరల్ మేనేజర్ పీవీ క్రిష్ణయ్యయాదవ్ భద్రతా పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులు, కార్మికుల తో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించి ప్రమాదరహిత కర్మాగారంగా పేరు తీసుకురా వాలన్నారు. భద్రతా నియమాలపై విద్యార్థులకు, ఉద్యోగులకు, కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

టీడీపీ నాయకుడి తోటకు నిప్పు

పుట్లూరు, మార్చి 4: మండలంలోని కందికాపుల గ్రామానికి చెందిన టీడీపీ మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి దానిమ్మతోటకు సోమవారం గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. ఈయన ఐదెకరాల్లో దానిమ్మ, మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నాడు. ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో 20 దానిమ్మ చెట్లు, మొక్కజొన్న పంటలు అగ్నికి ఆహుతయ్యాయి. వాటితోపాటు స్టార్టర్ బాక్స్ డ్రిప్పు వైర్లు, పైపులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రైతు శివశంకర్‌రెడ్డి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

తాడిపత్రి టౌన్, మార్చి4: స్థానిక కార్యాలయంలో సోమవారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మార్క్ ఆసుపత్రి అనంతపురం వారి సహకారంతో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 120మంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు వైద్యులు నిర్వహించారు. వీరిలో 10మందికి ఉన్నత చికిత్స నిమిత్తం రెఫర్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ధనం జ్యోతి, కార్యదర్శి కౌసర్, కోశాధికారి రషీద, మాధవి, వైద్యులు నాగరాజు, అనురాధ, రేణుక తదితరులు పాల్గొన్నారు.


శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మెట్టువి చిల్లర రాజకీయాలు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 4: వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నుంచి మెట్టు గోవిందరెడ్డి ముఖ్య అనుచరులు ముల్లంగి నారాయణస్వామి, ముల్లంగి భాస్కర్ టీడీపీలో చేర డంతో దాన్ని కప్పి పుచ్చుకోవడానికి మండలంలో వైసీపీ నాయకులు ఇళ్లలో పనిచేసేవారిని, ట్రాక్టర్ డ్రైవర్‌లకు కండువా కప్పి టీడీపీ నుంచి చేరారని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కాలవ శ్రీనివాసులు గెలుపు ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల వెంకటేశులు, ఎస్సీ నాగరాజు, సల్లాపురం బాబు, పయ్యావుల అనిల్, మల్లీడు శీన, విశ్వనాథ్‌రెడ్డి, పయ్యావుల రామకృష్ణ, వెంకటకృష్ణ, గోపి, వాల్మీకి దివాకర్ పాల్గొన్నారు.

భోజనానికని పిలిచి వైసీపీ కండువా వేశారు


కండువాలు వేసి ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 4: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో భోజనానికి పిలిచి మెట్టు గోవిందరెడ్డితో వైసీపీ కండువాలు వేయించి, ఆపార్టీలో చేరినట్లు ప్రకటించారని బొమ్మనహాళ్‌కు చెందిన టీడీపీ సానుభూతిపరులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మెట్టు గోవిందరెడ్డితో టీడీపీ కుటుంబాలకు వైసీపీ కండువాలు వేయడంతో బొమ్మనహాళ్‌కు చెందిన రాజు, రాము, సుంకన్న, క్రిష్ణ తదితరులు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జునలను కలిసి టీడీపీ కండువా వేయించుకున్నారు. ప్రాణం ఉన్నంత వరకు టీడీపీ వదిలే ప్రసక్తే లేదని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ కొత్తపల్లి మహేంద్ర, నాయకులు గాలి బసప్ప, శీన పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి: టీడీపీ


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ శ్రేణులు

రాయదుర్గం, మార్చి 4: ఎన్నికల ప్రచారంలో వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వెంట కొందరు మెప్మా విభాగానికి చెందిన ఆర్‌పీలు, వలంటీర్లు, చౌకధాన్య డిపో డీలర్లు పాల్గొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను టీడీపీ నాయకులు కోరారు. సోమవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు తహసీల్దార్ చిట్టిబాబుకు ఫిర్యాదు చేశారు. వీరు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినా పెడచెవిన పెట్టి పాల్గొంటున్నారని మండిపడ్డారు.

జీడిపల్లికి 566 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 4: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 566 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 600 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.398 టీఎంసీలు నీటి నిల్వ ఉందన్నారు.

విద్యా దీవెన నిధులు విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లు టౌన్, మార్చి 4: పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెనను నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూర్ పరమేష్ పేర్కొన్నారు. స్థానిక పొట్టిశ్రీరాముల సర్కిల్‌లో సోమవారం ఎస్ఎఫ్ఐ, విద్యార్థుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చదువులతో చెలగాటం ఆడుతోందన్నారు. ఉన్నత విద్య అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని చెబుతునే, మరోవైపు తల్లిదండ్రులు, విద్యార్థులను మోసం చేస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాలుగు నెలల మెస్, కాస్మెటిక్ బకాయిలు రూ.720 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్య దీవెన, మెస్, కాస్మోటిక్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బీమేష్, పట్టణ అధ్యక్షుడు చందు, నాయకులు సోము, బాలాజీ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయదుర్గం, మార్చి 4: పట్టణంలోని వినాయకసర్కిల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బేల్దారి రామకృష్ణ (53) సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన రామకృష్ణ బేల్దారీ పని చేస్తూ జీవించేవాడు. ఆదివారం తెల్లవారుజామున టీ తాగేందుకు వినాయకసర్కిల్‌కు వస్తుండగా కేఎస్‌ఆర్టీసీ కేఏ 57 ఎఫ్ 2549 నెంబరు గల బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో అనంతపురం సవీర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌బాబు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం తరలిస్తూ..

కుందుర్పి: మండలంలోని కృష్ణాపురం గేట్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈడిగ ఈశ్వరయ్య (55) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలంలోని లక్ష్మణపల్లికి చెందిన ఈడిగ ఈశ్వరయ్య కర్ణాటక ప్రాంతం నుంచి ద్విచక్రవాహనంపై అక్రమ మద్యం ప్యాకెట్లు తీసుకుని బయల్దేరాడు. కృష్ణాపురం గేటు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఈశ్వరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికీ తండ్రి రాకపోవడంతో ఈశ్వరయ్య కుమారుడు శ్యామ్ ప్రసాద్ తండ్రిని వెతుక్కుంటూ వచ్చాడు. కృష్ణాపురం గేటు వద్ద తండ్రి మృతదేహం పడి ఉండటం చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చంద్రబాబు సభకు తరలిన నాయకులు

కణేకల్లు, మార్చి 4: పెనుకొండ సమీపంలో సోమవారం జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు రా కదలి రా సభకు కణేకల్లు మండల నాయకులు తరలివెళ్లారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శి వేలూరు మరియప్ప, హనుమాపురం సర్పంచ్ జయరాంచౌదరి, అశోక్‌గౌడ్, వసగుడ్డం చిదానందతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

బొమ్మనహాళ్: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలో సోమవారం నిర్వహించిన రా కదిలి రా సభకు మండలం నుంచి భారీగా టీడీపీ శ్రేణులు తరలివెళ్లాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీధరఘట్ట, ఎల్‌బీనగర్, గోనేహాళ్, బొమ్మనహాళ్, హరే సముద్రం తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, ముల్లంగి భాస్కర్, ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు, ఎస్సీ నాగరాజు, పయ్యావుల అనిల్, మల్లీడు శీన, సొల్లపురం బాబు, రాము, పయ్యావుల గిరీష్, పయ్యావుల రమేష్, పయ్యావుల రామకృష్ణ, గోపి, దివాకర్ తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.


సభకు తరలి వెళుతున్న కణేకల్లు నాయకులు


పెనుకొండకు వెళుతున్న టీడీపీ నాయకులు